తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం - 29- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 331 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం



మీర్ఖాన్‌పేటలో పోలీస్ కమిషనరేట్ భూమిపూజ

భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు శ్రీకారం

మావోయిస్టులకు లొంగిపోవాలంటూ పిలుపు

సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీర్ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఇదే సందర్భంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసి, మల్కాజిగిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ పరిపాలనా బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు.

మిగతా 2లో






# నేడే పదో తరగతి ఫలితాలు విడుదల

మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాల ప్రకటన

5 లక్షలకు పైగా విద్యార్థుల ఉత్కంఠ

వాట్సాప్ ద్వారా ఫలితాల తెలుసుకునే సదుపాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు అధికారికంగా ఫలితాలను ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23 నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయింది.

మిగతా 2లో

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కీలక ఆదేశాలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచన
- తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

**కరీంనగర్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వేసవి కాలంలో తాగునీటి సమస్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ప్రస్తుత పరిస్థితులపై ఆయన సమగ్రంగా చర్చించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో శ్రీధర్, ఆర్డీవో రమేష్ బాబు పాల్గొన్నారు. మండల స్థాయిలో

మిగతా 2లో





# మెదక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడం

30 మందికి గాయాలు..

ముగ్గురి పరిస్థితి విషమం

ఆసుపత్రికి తరలించిన క్షతగాత్రులు

**మెదక్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొల్చారం సమీపంలో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న బస్సు, ముందున్న లారీని ఢీకొన్నట్లు సమాచారం. ఢీకొన్న ప్రభావంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో

# హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జూన్‌లో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహణ
- విదేశీ ప్రతినిధులకు ఆహ్వానం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల సందర్శన
- ప్రతి ఏడాది మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వైద్య పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. ఈ దిశగా జూన్ నెలలో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైద్య పర్యాటక రంగం ద్వారా రాష్ట్రానికి ఆర్థిక లాభాలతో పాటు

మిగతా 2లో



# హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్‌కు కీలక ముందడుగు

మూడు గంటల్లో ముంబై చేరుకునే అవకాశం

761 కిలోమీటర్ల పొడవుతో భారీ ప్రాజెక్టు

ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే కారిడార్

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నుంచి ముంబైకి వేగవంతమైన ప్రయాణానికి దారితీసే హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక నివేదిక పనులు పూర్తయ్యాయని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. తాజాగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన ఈ వివరాలను తెలియజేశారు. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ హైస్పీడ్ రైలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబైకి కేవలం మూడు గంటలలోపే చేరుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. గంటకు గరిష్ఠంగా 330 కిలోమీటర్ల వేగంతో ఈ రైళ్లు ప్రయాణించేలా రూపకల్పన చేసినట్లు చెప్పారు. మొత్తం 761 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో 12 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

ఈ ప్రాజెక్టులో ఎలివేటెడ్ మార్గాలు, భూగర్భ మార్గాలు రెండింటినీ వినియోగించనున్నారు.

మిగతా 2లో



# క్రిశాంక్ అరెస్టుపై హరీష్‌రావు ఆగ్రహం..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- కంది జైలులో బీఆర్ఎస్ నేతల పరామర్శ
- అక్రమ కేసులతో గొంతులు అణచివేత ఆరోపణలు
- రైతు సమస్యలు పట్టించుకోవట్లేదని మండిపాటు



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి తీరుపై తీవ్ర

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేడే పదో తరగతి ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ముందుగా మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని భావించినప్పటికీ, గడువుకు ముందుగానే విడుదల చేయడం విశేషంగా మారింది.

విద్యార్థులకు సులభతరం చేయడానికి ఈసారి కొత్త సాంకేతిక సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. వాట్సాప్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులకు ఫలితాల మెమో నేరుగా మొబైల్‌కు చేరనుంది.

ఇంకా ఆ సదుపాయం వినియోగించుకోని విద్యార్థులు కూడా సులభంగా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం 80969 58096 నంబర్‌కు 'Hi' అని సందేశం పంపాలి. ఆ తర్వాత 'SSC Results' ఎంపికను ఎంచుకుని, హాల్‌టికెట్ నంబర్ నమోదు చేస్తే ఫలితం వెంటనే ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ విధానం ద్వారా సర్వర్ల రద్దీ సమస్య లేకుండా వేగంగా ఫలితాలను పొందే అవకాశం ఉంది. విద్యార్థులు ఎక్కడ ఉన్నా సులభంగా తమ ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఫలితాల ప్రకటనతో విద్యార్థుల ఉత్కంఠకు తెరపడనుంది. తదుపరి విద్యా అవకాశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు ఇది కీలక దశగా నిలవనుంది.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.

**- అభివృద్ధి ఫలాలు అందరికీ**

ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తమ గ్రామాలను చేర్చాలని కోరుతున్న ప్రాంతాల ప్రజలకు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు పంపాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని పెట్టుబడులకు అనువైన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామని తెలిపారు. జూన్ 2 నాటికి ఫ్యూచర్ సిటీ కార్యాలయం నిర్మాణాన్ని పూర్తి చేసి అక్కడి నుంచే కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

**- మౌలిక వసతుల విస్తరణ**

హైదరాబాద్‌లో గతంలో ప్రతిపాదించిన హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి ప్రాజెక్టులు విజయవంతమైనట్లు గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ ట్రైన్ హబ్, మెట్రో రైలు, భారీ బస్ టర్మినల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. భూములు ఇచ్చే ప్రజలకు తగిన పరిహారం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం భూములు ఇచ్చే వారిని గౌరవించాలని అధికారులకు సూచించారు.

**- మావోయిస్టులకు పిలుపు**

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా అగ్రనేత గణపతి ఆరోగ్యం బాగోలేదని సమాచారం ఉందని, లొంగిపోతే అవసరమైన వైద్యం, భద్రత కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే 2024 నుంచి 800 మందికి పైగా నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసినట్లు వెల్లడించారు. వారిని ఆర్థికంగా ఆదుకుని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు అయితేనే నిజమైన ప్రగతి సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపుకు వాహనాల కొరత లేకుండా చూడాలని, బస్తాల సరఫరా సకాలంలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు పూర్తైన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. నీటి సరఫరా వ్యవస్థలను పర్యవేక్షిస్తూ ప్రజలకు నిరంతర సరఫరా అందేలా చూడాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈవెంట్‌ను విజయవంతం చేయడానికి పర్యాటక శాఖతో సమన్వయం చేసుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్‌లో దేశీయ, విదేశీ వైద్య, ఫార్మా రంగ నిపుణులను భాగస్వామ్యం చేయాలని మంత్రి తెలిపారు. ఆఫ్రికా, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి హైదరాబాద్ వైద్య రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని అన్నారు.

ప్రతినిధులు హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను కూడా సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా చూపించాలని సూచించారు. ముఖ్యంగా టిమ్స్ ఆస్పత్రుల్లో అంతర్జాతీయ రోగుల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి, ఒక్కో ఆస్పత్రిలో కనీసం 50 పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు. విదేశీ రోగులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందడం ద్వారా ఆదాయం పెరిగి, ఆ నిధులను తిరిగి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వినియోగించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈవెంట్‌ను ఒకసారి మాత్రమే కాకుండా ప్రతి ఏడాది నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు.

**- నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలకు సిద్ధం**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నియామక పత్రాలు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ నియామకాలతో ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత సమస్య కొంతవరకు తీరుతుందని అన్నారు.

**- వైద్య పోస్టుల భర్తీపై సమీక్ష**

ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీని వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలని అధికారులకు సూచించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, ఫార్మసిస్ట్, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో ఉన్న చట్టపరమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

గత రెండేళ్లలో సుమారు 12,650 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ పూర్తయితే రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

# హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్‌కు కీలక ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన సొరంగ మార్గం నిర్మాణం ముఖ్యాంశంగా నిలుస్తుంది. ఆధునిక సాంకేతికతతో ఈ పనులను చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కారిడార్ కేవలం రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడనుంది. పరిశ్రమలు, వాణిజ్య రంగాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి ఇది అభివృద్ధి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.

ఇదే సమీక్షలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రతిపాదించిన ఇతర హైస్పీడ్ మార్గాలపైనా చర్చ జరిగింది. అమరావతి మీదుగా వెళ్లే చెన్నై మార్గానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తోందని తెలిపారు. అలాగే బెంగళూరు మార్గానికి సంబంధించిన ప్రణాళికలను కూడా పరిశీలించారు. ఈ భారీ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల సమన్వయంతో పనులు పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.





# మెదక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఘటన స్థలంలోనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మిగతా గాయపడిన వారికి కూడా చికిత్స కొనసాగుతోంది. ప్రమాదం తీవ్రత దృష్ట్యా వెంటనే అంబులెన్స్‌ల ద్వారా వారిని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్య సిబ్బంది అత్యవసర సేవలను అందిస్తూ గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# క్రిశాంక్ అరెస్టుపై హరీష్‌రావు ఆగ్రహం..

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో విమర్శలు గుప్పించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి అణచివేయాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజాస్వామ్యాన్ని హామీ ఇచ్చి, ఇప్పుడు అదే ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విమర్శలు చేసే వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. క్రిశాంక్ తనకు వచ్చిన ఫేక్ పోస్టులపై పోలీసులకు ఆధారాలు ఇచ్చినా, అసలు నిందితులను వదిలేసి ఫిర్యాదు చేసిన వ్యక్తినే అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడంపై న్యాయస్థానం కూడా ప్రశ్నించిందని, ఇది కక్షసాధింపుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు చేసినందుకే వరుసగా కేసులు పెడుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. అంగన్‌వాడీ ఫోన్ల వ్యవహారం, టెన్త్ పేపర్ లీక్, భూముల వివాదాలు, ఇతర అంశాలపై ప్రశ్నించినందుకే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ప్రజలకు ప్రశ్నించే హక్కు లేదా అని ప్రశ్నించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని ఆయన మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి వేచి ఉన్నా స్పందన లేదన్నారు. పంటలకు సరైన ధర లేకపోవడం, కొత్త నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎకరాకు పరిమితులు పెట్టడం, తరుగు పేరుతో కోతలు విధించడం వంటి చర్యలు రైతులకు భారంగా మారాయని అన్నారు.

వడ్ల కొనుగోళ్లు సకాలంలో ప్రారంభం కాలేదని, మిల్లుల వద్ద లారీలు నిలిచిపోతున్నాయని తెలిపారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వాలా లేదా స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎండలో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. లేకపోతే ప్రజలు తగిన విధంగా స్పందిస్తారని హెచ్చరించారు.



## చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల రోడ్ల విస్తరణపై సీఎంకు కిషన్ రెడ్డి లేఖ

- **మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరం**
- **భూసేకరణ, రోడ్ల విస్తరణపై ప్రతిపాదనలు**
- **సీఎం జోక్యం కోరిన కేంద్ర మంత్రి**

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల వద్ద అప్రోచ్ రోడ్ల విస్తరణ, భూసేకరణ అంశాలపై కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. నగరంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన చర్లపల్లి టెర్మినల్, పునరాభివృద్ధి చెందుతున్న సికింద్రాబాద్ స్టేషన్ వద్ద రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని లేఖలో కోరారు. గతంలో పలుమార్లు విన్నవించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. చర్లపల్లి టెర్మినల్ పరిధిలో రోడ్ల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు వివరించారు. ఎఫ్‌సీఐ గోదాం రోడ్డును 200 అడుగులకు విస్తరించడం, భరత్ నగర్ వైపు ఉన్న రోడ్డును 100 అడుగులకు పెంచడం, ఈసీ నగర్ నుంచి ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాం వరకు రోడ్డును విస్తరించడం అవసరమని సూచించారు. అదేవిధంగా పార్కింగ్ తదితర అవసరాల కోసం భూసేకరణ చేపట్టాలని కోరారు. కొత్త భవనం వైపు 3 ఎకరాలు, ఎంఎంటీఎస్ వైపు 2.70 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రతిపాదించారు. నీటి సరఫరా కోసం రైల్వే శాఖ ఇప్పటికే నిధులు జమ చేసినందున కనెక్షన్ పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తర టెర్మినల్ వద్ద కూడా రోడ్ల విస్తరణ అవసరమని తెలిపారు. ఆల్ఫా హోటల్ నుంచి రథీఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగులకు విస్తరించాలని సూచించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇది ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ అంశంపై గతంలో కూడా పలుమార్లు లేఖలు రాసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధికి కీలకమైన ఈ పనులు త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనగణన 2027లో స్వీయ నమోదు.. జీహెచ్ఎంసీ పిలుపు

- **ప్రతి కుటుంబం ముందుకు రావాలని విజ్ఞప్తి**
- **ఆన్‌లైన్ విధానంతో సమయం ఆదా**
- **ఖచ్చితమైన గణాంకాలకు స్వీయ నమోదు కీలకం**

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** జనగణన 2027లో భాగంగా దేశవ్యాప్తంగా స్వీయ నమోదు విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ పౌరులకు ప్రత్యేక పిలుపునిచ్చింది. ప్రతి కుటుంబం స్వీయ నమోదు ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేయాలని కోరింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ స్వయంగా స్వీయ నమోదు పూర్తి చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచినట్లు అధికారులు తెలిపారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కుటుంబం ముందుకు వచ్చి ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వీయ నమోదు ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ఖచ్చితమైన గణాంకాలను నమోదు చేయడం సాధ్యమవుతుందని జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వ పాలన మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని వివరించింది.

పౌరులు సురక్షితమైన ఆన్‌లైన్ విధానం ద్వారా సులభంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ సరళంగా ఉండటంతో ఎవరైనా సులభంగా పూర్తి చేయగలరని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. అందరూ బాధ్యతగా వ్యవహరించి స్వీయ నమోదు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. పౌరుల భాగస్వామ్యంతోనే జనగణన ప్రక్రియ విజయవంతమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# ప్రజల విశ్వాసం కోల్పోతున్న న్యాయవ్యవస్థ

- **డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్**

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలకు న్యాయం అందించాల్సిన వ్యవస్థలపై విశ్వాసం రోజురోజుకు దెబ్బతింటోందని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం, దళారీ వ్యవస్థ పెరగడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కేసులు నమోదు చేయడంలో ఆలస్యం, ఫిర్యాదులను స్వీకరించకపోవడం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమే అనే రాజ్యాంగ సూత్రం అమలులో లేదని అన్నారు. పోలీస్ స్టేషన్ల వద్ద దళారీ వ్యవస్థ బలపడడంతో బాధితులు నేరుగా ఫిర్యాదు చేయలేక మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల వల్ల పేదలు, దళితులు, బలహీన వర్గాలు అత్యంత నష్టపోతున్నాయని, న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం క్రమంగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెంచే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీస్ శాఖను రాజకీయ ప్రభావం నుంచి విముక్తి చేయడం, ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా నమోదు చేయడం, దళారీ వ్యవస్థను నిర్మూలించడం వంటి సంస్కరణలు చేపట్టాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని, ప్రజా ఉద్యమాలు తీవ్రతరం కావడం అనివార్యమని అన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శనిగరం రాజ్ కుమార్, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి నిర్మల మనోహర్, బి కే యం యు జిల్లా కార్యదర్శి కద్ర లక్ష్మణ్, నాయకులు చంద్రమౌళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో నీటి ఎద్దడికి నోచాన్స్..!

- **ఎండలపై ముందస్తు యుద్ధం ప్రకటించిన చైర్మన్**



**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎండాకాలం ముదురుతున్న వేళ జమ్మికుంట పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్. మిషన్ భగీరథ డీఈతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పట్టణంలో నీటి సరఫరా పరిస్థితులను సమగ్రంగా సమీక్షించారు.

"ప్రజలకు ఒక్క చుక్క నీరు కూడా కొరత లేకుండా సరఫరా చేయడం మన బాధ్యత" అని చైర్మన్ స్పష్టం చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో నీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలని, ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే పరిష్కరించాలని అధికారులను కఠినంగా ఆదేశించారు.

పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ లోపాలు, నిల్వ సామర్థ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యమని, అందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మిషన్ భగీరథ ఏఈ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతుల కోసం పోరాటం మరింత వేగం..!

**- రాష్ట్ర కమిటీలోకి సంపత్ రావు**

జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రైతు ఉద్యమానికి మరో బలమైన స్వరం జతైంది. మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాసిర సంపత్ రావు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషంగా నిలిచింది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగిన తెలంగాణ రైతు సంఘం మూడవ మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోగా, అందులో సంపత్ రావుకు కీలక బాధ్యతలు అప్పగించారు. గత 30 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూనే ఆదర్శ రైతుగా గుర్తింపు పొందిన ఆయన, రైతాంగ సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ రైతుల గళంగా నిలిచారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి తీగల సాగర్, జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మరింత గట్టిగా పోరాడతానని స్పష్టం చేసిన ఆయన, జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయాలని కోరారు. "రైతు ఏడిస్తే రాజ్యం బాగుపడదు" అంటూ రైతుల కష్టాలను గుర్తు చేసిన సంపత్ రావు, సరళీకృత ఆర్థిక విధానాల వల్ల రైతుల పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో, వాటి నివారణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

అలాగే 55 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పెన్షన్ ఇవ్వాలని, చిన్న మరియు సన్నకారు రైతులకు ఉచితంగా ఎరువులు, పురుగుమందులు అందించాలని, పంటల బీమా పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

జిల్లాలో తెలంగాణ రైతు సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అండగా నిలుస్తామని సంపత్ రావు హామీ ఇచ్చారు.

# కార్యకర్తలే పార్టీ శక్తి శిక్షణ శిబిరాల్లో స్పష్టమైన సందేశం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**



హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కొత్తకొండ గ్రామంలో గల బి ఆర్ కే ఫంక్షన్ హాల్‌లో "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026" పేరిట బీజేపీ నియోజకవర్గ స్థాయి రెండు రోజుల శిక్షణ శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున సిద్దిపేట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రధాన సెషన్‌లో "అంత్యోదయ ద్వారా సంతృప్తత కేంద్ర ప్రభుత్వ పథకాలు" అనే అంశంపై ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన మరో సెషన్‌లో కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పాల్గొని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అనుసరించాల్సిన విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా వివరించారు. శిక్షణ శిబిరం రెండో రోజు రాష్ట్ర స్థాయి వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రావు అమరేందర్ రెడ్డి, ముగా జయశ్రీ పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నాయకులతో పాటు మండల అధ్యక్షులు, మండల నాయకులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు పార్టీ క్రియాశీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణ తరగతులు జాతీయ గీతాలాపనతో ముగిశాయి.

# మే డేకు హుజురాబాద్ సిద్ధం




- **కార్మిక హక్కుల కోసం పోరాటానికి పిలుపు**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కదిరే రమేష్ అధ్యక్షతన మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మే డేను వైభవంగా జరపాలని నిర్ణయించారు.

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, 1886లో చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకున్న చారిత్రక పోరాటాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. వెంటనే ఆ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అన్ని రంగాల కార్మికులకు సమాన హక్కులు కల్పించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కొంకట చంద్రయ్య, ప్రతాప్ శ్రీనివాస్, తాడూరి లత, ఇమ్మడి శ్రీకాంత్, కొలుగూరి కుమార్, మోరే మహేష్, వెంకటేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి కేకలు వినిపిస్తున్నాయా.. జగ్గయ్యపల్లెలో చెట్ల మర్డర్!

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లె గ్రామంలో ప్రకృతి సంపదపై దాడి జరుగుతోంది. గ్రామం చివరలో ఎస్సారెస్పీ కెనాల్ పక్కన వరుసగా ఉన్న చెట్లను కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే నరికి ట్రాక్టర్లలో తరలిస్తూ అమ్ముకుంటున్న ఘటన స్థానికులను కలవరపెడుతోంది.

గ్రామస్థుల వాదన ప్రకారం, ఈ చెట్ల నరికివేతకు గ్రామ కార్యదర్శి లేదా కెనాల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అయినప్పటికీ "మా ఇష్టం" అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెట్లను కొట్టడం కొనసాగిస్తున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై బెదిరింపులకు కూడా దిగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకు ఈ చెట్లు గ్రామ ప్రజలకు ఒక జీవనాధారంలా నిలిచాయి. మండే ఎండల్లో రైతులు, కూలీలు ఈ చెట్ల నీడలో విశ్రాంతి తీసుకుంటూ భోజనం చేసేవారు. గీత కార్మికులు కూడా ఇక్కడే సేదతీరేవారు. ఇప్పుడు ఆ చెట్లు ఒక్కొక్కటిగా మాయం అవుతుండటంతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

ఒక సందర్భంలో గ్రామస్థులు ట్రాక్టర్‌ను అడ్డుకుని చెట్ల మొద్దులను కింద పడేసి నిరసన తెలిపారు. ఈ సమయంలో చెట్లను నరికిస్తున్న వ్యక్తి "బాబుజీ" అనే వ్యక్తి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. అయినప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటివరకు స్పందించకపోవడం మరింత విమర్శలకు దారితీస్తోంది.

"ఇప్పుడే ఎండలు భగ్గుమంటున్నాయి... చెట్లే లేకపోతే మనం ఎక్కడికి వెళ్తాం? ఆక్సిజన్ ఎక్కడి నుంచి వస్తుంది?" అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా చెట్లను నరికిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా?
- లేకపోతే ప్రకృతి నాశనం చూస్తూ మౌనంగా ఉంటారా?

జగ్గయ్యపల్లెలో జరుగుతున్న ఈ చెట్ల దోపిడీపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సిబ్బందికి భద్రత ఎక్కడ..? జమ్మికుంటలో మున్సిపల్ ఉద్యోగుల నిరసన




**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ సిబ్బందిపై దాడి ఘటనపై జమ్మికుంటలో ఆగ్రహం చెలరేగింది. మున్సిపాలిటీ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తూ దాడికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా సాగింది. "ప్రజా సేవలో ఉన్న సిబ్బందిపై దాడులు అసలు సహించం" అంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేటర్ భర్త సానిటరీ ఇన్స్పెక్టర్‌పై దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ సిబ్బంది భద్రతకు హామీ ఇవ్వాలని, విధుల్లో భయంలేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసనలో సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవస్థానం నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం..!

- **రోడ్డెక్కిన హనుమాన్ భక్తులు**

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**



ఇల్లంతకుంట దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంపై హనుమాన్ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఇల్లందకొండ చౌరస్తాలో రోడ్డుపై నిరసన చేపట్టారు.

భక్తులు మాట్లాడుతూ, ఆలయంలో కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, భక్తులపై అదనపు బిల్లులు మోపుతూ అవినీతి జరుగుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు.

దేవస్థానం అధికారులు భక్తుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించిన భక్తులు, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని భక్తులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. సమస్యలను చట్టపరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, భక్తులను శాంతింపజేసి నిరసనను విరమింపజేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పెట్రోల్, డీజిల్ బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు

- నిల్వలపై ఆందోళన అవసరం లేదు: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**సత్తుపల్లి, ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇంధన బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించే చర్యలపై పోలీసు శాఖ నిఘా కొనసాగుతోందన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఉన్నప్పటికీ లేదని చెప్పడం, అధిక ధరలకు విక్రయించడం వంటి ఘటనలు గమనించినట్లయితే, వెంటనే పౌరసరఫరాల శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపోహలు నమ్మి ఇంధనాన్ని అధికంగా నిల్వ చేసుకోవద్దని, అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు. జిల్లాలో ఇంధన సరఫరా సజావుగా కొనసాగుతోందని, ఎటువంటి అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు.

# ప్రశంసా పత్రం అందుకున్న ముల్కనూర్ ఎస్సై రాజు



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలందిస్తున్న ముల్కనూర్ ఎస్సై రాజుకు ప్రశంసలు దక్కాయి. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. పోలీసు విధుల్లో క్రమశిక్షణ, సమయపాలనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించినందుకు ఈ పురస్కారం అందించినట్లు అధికారులు తెలిపారు. ఎస్సై రాజు చేసిన సేవలు పోలీస్ శాఖలో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.
స్థానిక ప్రజలు మరియు సహచర సిబ్బంది కూడా ఎస్సై రాజును అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి



**పెద్దమందడి,ఏప్రిల్28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో ఐకెపి కేంద్రాల ద్వారా వడ్ల కొనుగోలు కార్యక్రమాన్ని స్థానిక గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు.అదేవిధంగా రైతులు తేమశాతం తగ్గే వరకు వడ్లను బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందన్నారు .ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ సత్యరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గట్టు యాదవ్, ఏపీఎం సక్కు నాయక్, కేంద్ర నిర్వాహకులు శారద, అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



# మేడే ఘనంగా జరపాలి: సిపిఎం

- లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్.

**సత్తుపల్లి, ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు):** మే 1న జరిగే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే)ను ఘనంగా నిర్వహించాలని సిపిఎం పిలుపునిచ్చింది. సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ సమావేశం రావి వీర వెంకయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, నాయకుడు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత కార్మికులు సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికులకు నష్టం కలిగిస్తోందని విమర్శించారు. వెంటనే ఆ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, కార్మిక హక్కుల హననంపై పోరాటాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మేడే సందర్భంగా ర్యాలీలు, సభలు, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, సైదా, రాము, ఓలేటి శ్రీహరి, చెరుకు రత్నకుమారి తదితరులు పా

# మాజీ మావోయిస్టులకు కొత్త జీవితం

- గిరిదర్శకులుగా నియామకం
- సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత
- పర్యాటక రంగంలో గిరిజన యువతకు అవకాశం
- సమాజంలో భాగస్వామ్యం దిశగా వినూత్న చర్య



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** అజ్ఞాతం వీడి సాధారణ జీవితంలోకి రావాలనుకునే మాజీ మావోయిస్టులకు కొత్త అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 20 మంది మాజీ మావోయిస్టు గిరిజన యువకులను గిరిదర్శకులుగా నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు.
ఈ కార్యక్రమం భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భూమి పూజ సందర్భంగా జరిగింది. గిరిజన యువతకు స్థిర జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో వారికి శిక్షణ ఇచ్చి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో టూరిస్ట్ గైడ్లుగా నియమించారు. పోలీసు, గిరిజనాభివృద్ధి, పర్యాటక, అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు సహాయం చేసే విధంగా ప్రత్యేక శిక్షణ అందించారు.

**- పర్యాటకులకు మార్గదర్శకులుగా సేవలు**

తొలి విడతలో ఎంపికైన 20 మంది గిరిజన యువత ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. స్థానిక సంస్కృతి, చరిత్ర గురించి పర్యాటకులకు వివరించడంతో పాటు అటవీ నియమాలను పాటించేలా అవగాహన కల్పిస్తారు. అలాగే పర్యాటకులకు భద్రత కల్పించడంలో కూడా ఈ గిరిదర్శకులు కీలక పాత్ర పోషిస్తారని అధికారులు తెలిపారు. ప్రత్యేక యూనిఫామ్‌లతో విధులు నిర్వహించే వీరు పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా నిలవనున్నారు.

**- అభివృద్ధి దిశగా కీలక అడుగు**

గతంలో తీవ్రవాద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడమే కాకుండా గిరిజన యువతను సమాజంలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఒకప్పుడు మావోయిస్టులకు దారి చూపిన యువకులు ఇకపై పర్యాటకులకు మార్గదర్శకులుగా మారడం ప్రత్యేకతగా నిలుస్తోంది.
ఈ సందర్భంగా గిరిదర్శకులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఆరు నెలల పాటు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. శిక్షణ కాలంలో వారికి స్కాలర్‌షిప్ అందించాలన్నారు. సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి గిరిజన యువతను తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సానుకూల ఫలితాలు ఇస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# టీనేజ్ బాలికలకు సైకిల్ రైడింగ్ శిక్షణ ప్రారంభం

- స్నేహ సమ్మర్ ప్రోగ్రాంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు
- లైఫ్ స్కిల్స్‌తో బాలికలకు సాధికారత
- 'అమ్మకు అక్షరమాల' ద్వారా మహిళలకు విద్యాబోధన

**కామారెడ్డి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** టీనేజ్ బాలికల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్నేహ సమ్మర్ ప్రోగ్రాంలో భాగంగా సైకిల్ రైడింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల బాలికలకు ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులో బాలికలు స్వతంత్రంగా ప్రయాణించేందుకు, బైక్ రైడింగ్ నేర్చుకునేందుకు ఇది తొలి అడుగుగా ఉపయోగపడుతుందని అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా లైఫ్ స్కిల్స్, ప్రాక్టికల్ నైపుణ్యాలను బాలికలకు బోధిస్తున్నట్లు పేర్కొన్నారు.
సైకిల్ రైడింగ్ శిక్షణతో పాటు బాలికల్లో ధైర్యం, ఆత్మస్థైర్యం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గ్రామ గ్రామాన ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను విస్తరించాలని అధికారులకు సూచించారు.
ఇదే కార్యక్రమంలో భాగంగా 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మహిళలకు అక్షరాస్యత కల్పిస్తూ చదవడం, రాయడం నేర్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల మహిళలకు విద్యాబోధన అందిస్తున్నట్లు వెల్లడించారు.
మహిళల సాధికారతకు విద్య అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారితే కుటుంబం, సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క స్వయంగా మహిళలతో కలిసి అక్షరాలు దిద్దించి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు మహిళలు, బాలికల భవిష్యత్తును మరింత బలోపేతం చేస్తాయని ఆమె పేర్కొన్నారు.





# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.!

- తక్కువ యూరియా వినియోగం
- సేంద్రియ సాగుపై అవగాహన

**సత్తుపల్లి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం మంగళవారం కాకర్లపల్లి రైతువేదికలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట అసోసియేట్ డీన్ డా. జె. హేమంత కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమైంది. ఉద్యాన విభాగం ప్రొఫెసర్ డా. ఐ.వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తక్కువ యూరియా వినియోగం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. అధిక రసాయనాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆయిల్ పామ్‌తో పాటు ఇతర ఉద్యాన పంటల సాగు, మార్కెటింగ్‌పై సూచనలు ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. డా. ఆర్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మార్కెట్లో గిరాకీ ఉన్న పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేల, నీరు, పర్యావరణం అందించడం రైతుల బాధ్యత అని అన్నారు. మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాస్ రావు, పశువైద్య అధికారి డా. శశిదీప్, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి రాజేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. అనూష, సర్పంచ్ మారేశ్వరరావు, ఉప సర్పంచ్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయినా... ధాన్యం కొనుగోలు నత్తనడక

- రమేష్ బిజెపి మాజీ మండల అధ్యక్షుడు

**పెద్దమందడి,ఏప్రిల్28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెద్దమందడి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, ఉరుములు మెరుపులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రోజులు తరబడి అక్కడే నిల్వ ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు.కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు వెంటనే న్యాయం చేయాలని, కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం - 29 - ఏప్రిల్ 2026
వరంగల్


# ఎల్కతుర్తిలో రాజకీయ కలకలం బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు భారీ చేరికలు



**ఎల్కతుర్తి, ఏప్రిల్ 28( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి ఆధ్వర్యంలో చింతలపల్లి గ్రామానికి చెందిన సుమారు 30 బిఆర్ఎస్ కుటుంబాలు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్తగా పార్టీలో చేరిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నాయని అన్నారు. ముఖ్యంగా పేదల కోసం అమలు చేస్తున్న "ఇందిరమ్మ ఇల్లు" వంటి పథకాలు గ్రామీణ ప్రజలను ఆకర్షిస్తున్నాయని తెలిపారు.

చింతలపల్లి గ్రామానికి చెందిన కొత్తగా చేరిన కుటుంబాలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలిచే పార్టీ అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా తమకు లబ్ధి చేకూర్చే విధంగా ఉన్నాయని, గతంలో ఎదుర్కొన్న సమస్యలకు సరైన పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆశాజనకంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయిలో ఈ తరహా చేరికలు కొనసాగుతుండటంతో ఎల్కతుర్తి మండలంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

# డీజిల్ కొరతతో రైతుల ఆందోళన – సరఫరా పెంచాలని డిమాండ్



**హుజురాబాద్ ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో డీజిల్ కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి కొండల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వరి కోతలు జోరుగా కొనసాగుతున్న నేపథ్యంలో డీజిల్ అందుబాటులో లేకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారిందన్నారు.

వరి కోత పనులు నిర్వహించడానికి, అలాగే కోత చేసిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్లకు తరలించేందుకు వాహనాలకు డీజిల్ ఎంతో కీలకమని పేర్కొన్నారు. సరిపడా డీజిల్ లేకపోతే పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని, చేతికి వచ్చిన పంట పొలాల్లోనే ఉండిపోయే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లే అవకాశముందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డీజిల్ సరఫరాను పెంచి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎర్రవెల్లి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కరీంనగర్ ఘటనపై హుజూరాబాద్ మున్సిపల్ సిబ్బంది ఆగ్రహం



నల్ల బ్యాడ్జీలతో నిరసన

**హుజూరాబాద్, ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్స్పెక్టర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం హుజూరాబాద్ మున్సిపాలిటీ సిబ్బంది నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట బైఠాయించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మోసబ్ అహ్మద్ సయ్యద్ మాట్లాడుతూ, ప్రజాసేవలో నిమగ్నమైన ఉద్యోగులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే చర్యలు తీసుకుని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ సిబ్బంది తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఉద్యోగుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇందిరా మహిళ డెయిరీ విజయవంతం చేసేందుకు సమగ్ర ప్రణాళిక అమలు చేయాలి...

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు ):** ఇందిరా మహిళా డెయిరీని విజయవంతం చేసేందుకు విజయ డెయిరీ నమూనాను అనుసరిస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు.

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ అమలులో వ్యవస్థీకృత విధానాన్ని అనుసరించాలని సూచించారు. విజయ డెయిరీ ప్రతినిధులను కూడా ఆ బోర్డులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. దీనివల్ల మహిళా సంఘాలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, కార్యక్రమం సమర్థవంతంగా నడుస్తుందని అన్నారు.

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తుండగా, ఇందిరా మహిళా డెయిరీ ద్వారా దశల వారీగా 40 వేల లబ్ధిదారులకు పశువులు పంపిణీ చేసి, రోజుకు 80 వేల లీటర్ల పాలు సేకరించే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.

విజయ డెయిరీ నమూనాను ప్రతిరూపంగా తీసుకుని, అవసరమైన విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, రిటైర్డ్ ఉద్యోగుల మార్గదర్శకత్వాన్ని వినియోగించు కోవాలని సూచించారు. శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రతి నిర్ణయాన్ని లిఖిత పూర్వకంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎంఎన్ఆర్ఈజీఏ (న్రేగ్స్ ) నిధులను లబ్ధిదారుల పశువుల షెడ్ల నిర్మాణానికి వినియోగించే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పశువుల కొనుగోలు లబ్ధిదారుల ఆమోదంతోనే జరగాలని, కొనుగోలు మార్గదర్శకాలపై ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

బీఎంయూ స్థాయిలో విజయ డెయిరీ సిబ్బంది నమూనాను అనుసరించి, అదే విధానాన్ని ఇందిరా మహిళా డెయిరీలో అమలు చేయాలని, మహిళలు వివిధ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ మొత్తాన్ని సకాలంలో జమ చేయడానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ల్ డి ఎం )తో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, లబ్ధిదారుల కోసం నాన్‌ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాలను ప్రారంభించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

రాష్ట్రానికి రోజు ఇతర రాష్ట్రాల నుంచి అనేక లీటర్ల పాలు దిగుబడి అవుతున్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరా మహిళా డెయిరీ పశువుల పంపిణీ ద్వారా ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే పాలను సమర్థవంతంగా సేకరించేలా అవసరమైన ఒప్పందాలు కుదుర్చుకుని, దశల వారీగా పాల ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ, ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు అమలు విధానంపై వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు విజయవంతం కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఓ., ట్రైబల్ వెల్ఫేర్, బిసి, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, ఏపిఎం., సంబంధిత మండల ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజ ఐక్యతకు దోహదం

- **బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. గౌడ సంఘం విజ్ఞప్తి మేరకు దాతలు లోకిని సూరయ్య, డాక్టర్ సంపత్, రాజు లు తమ తండ్రి కీర్తిశేషులు లోకిని పెద్ద ముత్తయ్య గారి జ్ఞాపకార్థం ఈ ముఖద్వారాన్ని నిర్మించారు.

ముఖద్వారం ప్రారంభానికి ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం మంత్రి రిబ్బన్ కట్ చేసి ముఖద్వారాన్ని భక్తులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తుందని అన్నారు.

రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం ప్రాంతీయ భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని, దాతలు ఆలయ అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. లోకిని పెద్ద ముత్తయ్య గారి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నిర్మించిన ఈ ముఖద్వారం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# డంపింగ్ యార్డ్‌పై బీజేపీ ఆగ్రహం – సీఎం దిష్టిబొమ్మ దహనం

**హుజురాబాద్, ఏప్రిల్ 28(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. జమ్మికుంట-హుజురాబాద్ ప్రధాన రహదారిపై చెల్పూర్ గ్రామంలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, అభివృద్ధి ప్రాంతంగా ఎదుగుతున్న హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డంపింగ్ యార్డ్ వల్ల ఉత్పత్తి అయ్యే వ్యర్థాల కారణంగా ప్రజలు అనేక అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సింగపూర్‌లో ఐఓఎస్ సాగర్ నౌకకు ఘన స్వాగతం

**సింగపూర్, ఏప్రిల్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రత, సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ప్రయాణిస్తున్న ఐఓఎస్ సాగర్ నౌక సింగపూర్‌లోని చాంగీ నౌకాదళ స్థావరానికి చేరుకుంది. ఈ సందర్శన భాగంగా నౌకను ప్రజలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు నౌకను సందర్శించి సముద్ర జీవితం గురించి ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. నౌకలో నిర్వహించిన కార్యక్రమాలు సముద్ర అవగాహన పెంపొందించడంపై దృష్టి సారించాయి.




ఏప్రిల్ 27న ఐఓఎస్ సాగర్ సిబ్బంది, భారతీయ వలసవాసులతో కలిసి "ఒక సముద్రం - ఒక లక్ష్యం" అనే అంశంపై ప్రత్యేక పరుగుపందెం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సముద్ర భద్రత, ఐక్యతపై సందేశాన్ని ఇచ్చారు. ఈ మిషన్‌లో భాగంగా ఐఎన్ఎస్ సునయనా కూడా కీలక పాత్ర పోషిస్తోంది. సముద్ర సహకారం, భద్రతను మరింత బలోపేతం చేయడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. నౌక ఏప్రిల్ 29న సింగపూర్ నుంచి బయలుదేరి తదుపరి గమ్యస్థానాలకు ప్రయాణం కొనసాగించనుంది. భారత మహాసముద్ర ప్రాంతంలో పరస్పర సహకారం పెంపొందించడంలో ఈ యాత్ర కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్శనతో భారతదేశం సముద్ర భద్రత, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉందనే సందేశం మరింత బలపడిందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# డిజిటల్ అరెస్ట్ మోసాలపై కట్టడి చర్యలు వేగం

దేశవ్యాప్తంగా గత కొన్ని నెలలుగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు తీవ్రంగా పెరుగుతున్నాయి. సామాన్య ప్రజల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ మోసాలకు బలవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై సుప్రీంకోర్టు కూడా గంభీరంగా స్పందించింది. బాధితులు మోసపోయే విధానం కొత్త తరహాలో ఉండటం వల్ల ప్రజలు సులభంగా ఉచ్చులో పడుతున్నారని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం పలు కఠిన నిబంధనలను రూపొందించింది. ఈ నిబంధనలపై సమగ్ర నివేదికను తాజాగా సుప్రీంకోర్టుకు సమర్పించింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు సాంకేతిక చర్యలు, బ్యాంకింగ్ నియంత్రణలు, టెలికాం మార్పులు వంటి అంశాలను ఈ నివేదికలో చేర్చినట్లు తెలుస్తోంది.

కేంద్రం సమర్పించిన నివేదికలో ప్రధానంగా బయోమెట్రిక్ సిమ్ ధృవీకరణ, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల తాత్కాలిక నిలిపివేత వంటి చర్యలు కీలకంగా ఉన్నాయి. నిపుణులు, సంబంధిత విభాగాల అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించి సంబంధిత శాఖలకు మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. సిమ్ కార్డుల జారీ ప్రక్రియలో కఠిన నిబంధనలు అమలు చేయాలని కేంద్రం సూచించింది. టెలికాం సేవలందించే సంస్థలు వినియోగదారుల గుర్తింపును ఖచ్చితంగా ధృవీకరించాల్సి ఉంటుంది. సిమ్ యాక్టివేషన్ సమయంలో పాయింట్ ఆఫ్ సేల్స్ విక్రేతలను తరచుగా పరిశీలించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో వినియోగదారుల వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా మోసాలకు ఉపయోగించే సిమ్ కార్డులను వెంటనే బ్లాక్ చేయాలని కేంద్రం సూచించింది. వాట్సాప్ వంటి యాప్‌లు సిమ్ ఆధారిత భద్రతా విధానాలను మరింత కఠినంగా అమలు చేయాలని పేర్కొంది. దీర్ఘకాలం కొనసాగుతున్న అనుమానాస్పద కాల్స్‌ను గుర్తించే సాంకేతిక ఫీచర్లు తీసుకురావాలని సూచించింది. మోసాలకు ఉపయోగించే డివైజ్‌లను గుర్తించి వాటి వినియోగాన్ని నిలిపివేయాలని నివేదికలో పేర్కొన్నారు. సైబర్ నేరాలకు ఉపయోగించే బ్యాంకు ఖాతాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే ఆ ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని పేర్కొంది. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని నివేదికలో స్పష్టం చేసింది. ఈ చర్యలతో డిజిటల్ అరెస్ట్ మోసాలను గణనీయంగా తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది.

# ఎండల దెబ్బకు విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయికి

దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ ప్రభావం కొనసాగుతోంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. పగటి వేళల్లో వేడి తట్టుకోలేని స్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఎయిర్ కండీషనర్లు, డెజర్ట్ కూలర్లు అధికంగా వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితి విద్యుత్తు వినియోగంపై కూడా స్పష్టంగా ప్రభావం చూపుతోంది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తు వినియోగం నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. విద్యుత్తు శాఖ గణాంకాల ప్రకారం ఏప్రిల్ 27న సుమారు 256 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ విద్యుత్తు అవసరం కూడా పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఈ నెలలో విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా నెల రెండో భాగం నుంచి వినియోగం మరింతగా



పెరిగింది. శుక్రవారం 252.07 గిగావాట్లు, శనివారం 256.11 గిగావాట్ల వినియోగం నమోదైనట్లు సమాచారం. అయితే ఆదివారం రోజు వినియోగం కొంత తగ్గి 238.15 గిగావాట్లకు చేరింది. ఆదివారం రోజున వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు సెలవు ఉండటంతో విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ధూళి తుఫానులు, వర్షాలు కురవడం కూడా వినియోగం తగ్గడానికి కారణమైంది. అయినప్పటికీ మొత్తం మీద విద్యుత్తు అవసరం అధికంగానే కొనసాగుతోంది.

గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది వినియోగం మరింత ఎక్కువగా నమోదవుతోంది. 2025 జూన్‌లో ఒక రోజు 242.77 గిగావాట్లు, 2024 మేలో 250 గిగావాట్లు, 2023 సెప్టెంబరులో 243.27 గిగావాట్ల వినియోగం నమోదైంది. ఈ గణాంకాలతో పోలిస్తే ప్రస్తుతం నమోదవుతున్న వినియోగం రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ వేసవిలో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశముందని వాతావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు వినియోగం గరిష్టంగా 270 గిగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సరఫరా కొనసాగించేందుకు విద్యుత్తు శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

# సిక్కింలో పిల్లలతో ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

సిక్కిం పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్యాంగ్‌టాక్‌లో పిల్లలతో కలిసి ఫుట్‌బాల్ ఆడి ఆకట్టుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ ఉదయం ఆయన బాలబాలికలతో కలిసి మైదానంలోకి దిగారు. అమ్మాయిలు, అబ్బాయిలు సమానంగా పాల్గొనగా, ఆట ఉత్సాహభరితంగా సాగింది. పిల్లలతో కలిసి ఆటలో పాల్గొన్న మోదీ ఎంతో ఆనందంగా గడిపినట్లు తెలిపారు. ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా గోల్‌పోస్ట్ వద్ద నిలబడి గోల్ కొట్టేందుకు ప్రయత్నించిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంలో పిల్లలలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు




మానసిక ధైర్యాన్ని పెంచే సందేశాన్ని కూడా ఆయన అందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలు, వీడియోలను మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. సిక్కింలో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడటం ఎంతో ప్రత్యేక అనుభవమని ఆయన పేర్కొన్నారు. యువతలో ఉన్న ఉత్సాహం, శక్తి తనకు ప్రేరణనిచ్చిందని తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన పెరుగుతుందని ప్రధాని సూచించారు. పిల్లలు చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని ఆయన ప్రోత్సహించారు. సిక్కిం పర్యటనలో భాగంగా స్థానిక సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని కూడా ఆయన తెలుసుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకులు సమాజానికి సానుకూల సందేశాన్ని ఇవ్వగలరని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# రైల్వే ట్రాక్ వద్ద పేలుడు ఘటన.. నిందితుడు మృతి

పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలా సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద పేలుడు ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన రాత్రి వేళల్లో జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. రైల్వే ట్రాక్‌ను లక్ష్యంగా చేసుకుని బాంబు పేల్చే ప్రయత్నం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శంభూ, రాజ్‌పురా మార్గంలో ఉన్న బొతోనియా గ్రామం వద్ద ఈ పేలుడు చోటుచేసుకుంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ ఓ వ్యక్తి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గుర్తించారు. బాంబును పేల్చే క్రమంలోనే ఆ వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు భావిస్తున్నారు.

మరణించిన వ్యక్తిని జగరూప్ సింగ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అతను తరన్ తారన్ ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. రైల్వే ట్రాక్‌ను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో బాంబును అమర్చే ప్రయత్నంలో ప్రమాదం జరిగినట్లు దర్యా




ప్తులో వెల్లడైంది. ఈ ఘటన సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జరిగింది. పేలుడు కారణంగా రైల్వే ట్రాక్ కొంత మేర దెబ్బతింది. భద్రతా చర్యలలో భాగంగా కొన్ని రైళ్లను మార్గమార్పు చేశారు. తక్కువ తీవ్రత గల పేలుడు అని మొదట భావించినప్పటికీ, తర్వాత ఇది పెద్ద ప్రమాదానికి దారితీసే ప్రయత్నమని అధికారులు గుర్తించారు.

ఘటన స్థలం నుంచి ఒక సిమ్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. దీని ఆధారంగా సాంకేతిక దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్ర కోణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును రైల్వే భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు కలిసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇండోనేషియాలో రైళ్ల ఢీకొనడం.. 14 మంది మృతి

ఇండోనేషియా దేశంలో ఘోర రైలుప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని జకార్తా శివారులోని బెకాసి ప్రాంతంలో రెండు రైళ్లు ఢీకొనడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 84 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. రైల్వే అధికారుల సమాచారం ప్రకారం శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒక స్థానిక ప్రయాణికుల రైలు, మరో దీర్ఘదూర రైలు సోమవారం ఢీకొన్నట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరినట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధిపతి తెలిపారు.

రక్షణ బృందాలు గాలింపు ప్రక్రియను పూర్తిచేసినట్లు ప్రకటించాయి. రైల్వే బోగీలు పూర్తిగా ధ్వంసమవడంతో అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయడం పెద్ద సవాలుగా మారింది. ఇనుప కడ్డీలను కట్



చేస్తూ ప్రయాణికులను రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఒక మహిళల బోగీ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. బాధితుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం ముందుగా ఒక రైలు ట్యాక్సీతో ఢీకొని నియంత్రణ కోల్పోయిందని, అనంతరం మరో రైలును ఢీకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు గల అసలు కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఐక్యరాజ్యసమితి సంస్కరణలపై చర్చలు

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ న్యూఢిల్లీలో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ అధ్యక్షురాలు అన్నలీనా బేర్‌బాక్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి భవిష్యత్ దిశ, అంతర్జాతీయ అంశాలపై విస్తృత చర్చలు జరిపారు. భేటీలో ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల పురోగతి వంటి అంశాలను పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో మార్పులు అవసరమని ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు.

కృత్రిమ మేధస్సు ప్రభావం, దాని భవిష్యత్ వినియోగంపై కూడా చర్చ జరిగింది. ఈ సాంకేతికత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, భద్రతా వ్యవస్థలపై చూపే ప్రభావాన్ని సమీక్షించారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ సౌత్ దేశాల అవసరాలు, అభిప్రాయాలు ప్రతిబింబించేలా బహుపాక్షిక వ్యవస్థలో సంస్కరణలు అవసరమని జైశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలను ప్రతిబింబించే విధంగా అంతర్జాతీయ సంస్థలు మారాల్సిన అవసరం ఉందని అన్నారు.

అన్నలీనా బేర్‌బాక్ నాయకత్వాన్ని జైశంకర్ ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి కార్యక్రమాల్లో ఆమె చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ భేటీ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం అంతర్జాతీయ వేదికపై భారత్ పాత్రను మరింత బలపరిచే దిశగా కీలకంగా మారనుందని నిపుణులు భావిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 29 - ఏప్రిల్ 2026


# నృత్య కళా వైభవం

## అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు



మానవ భావోద్వేగాలను, సంస్కృతిని, సంప్రదాయాలను అభినయం ద్వారా వ్యక్తపరిచే అద్భుతమైన ప్రక్రియ నృత్యం. ప్రతి ఏటా ఏప్రిల్ 29వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఆధునిక నృత్య రీతులకు పునాదులు వేసిన విదేశీ నృత్య విద్వాంసుడు జీన్‌జార్జెస్ నోవెర్రే జన్మదినాన్ని పురస్కరించుకుని, ప్రపంచ సంస్థల ఆమోదంతో 1982లో ఈ రోజును ప్రకటించారు. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న నృత్య కళాకారులను ఏకం చేయడం, సామాన్య ప్రజలలో నృత్యం పట్ల అవగాహనను, ఆసక్తిని పెంపొందించడం.

నృత్యం అనేది కేవలం శారీరక కదలిక మాత్రమే కాదు, అది ఆత్మ యొక్క భాషగా వర్ణించబడుతుంది. భాషా భేదాలు, ప్రాంతీయ సరిహద్దులు లేని ఒకే ఒక్క కళారూపం నృత్యం మాత్రమే. ఇది మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ఐక్యతను పెంపొందిస్తుంది. పురాతన కాలం నుండి మానవుడు తన సంతోషాన్ని, భక్తిని, ఉద్వేగాలను నృత్యం ద్వారానే వ్యక్తపరుస్తూ వస్తున్నాడు. భారతదేశంలో భరతనాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాల నుండి నేటి జానపద, ఆధునిక నృత్యాల వరకు ప్రతి ఒక్కటి మన జీవనశైలిలో అంతర్భాగంగా మారిపోయాయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో నృత్యం ఒక గొప్ప వ్యాయామంగా, మానసిక ప్రశాంతతను ఇచ్చే సాధనంగా ఉపయోగపడుతోంది. శారీరక దృఢత్వంతో పాటు, ఏకాగ్రతను పెంచడంలో నృత్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఒత్తిడితో కూడిన పని వాతావరణంలో ఉన్నవారు రోజులో కొంత సమయం నృత్యం చేయడం వల్ల మానసిక ఉత్తేజాన్ని పొందుతున్నారని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అందుకే నేడు విద్యాలయాల్లో, కార్యాలయాల్లో కూడా నృత్యాన్ని ఒక చికిత్సగా, క్రీడగా ప్రోత్సహించడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.

అయితే ఆధునిక పోకడల మధ్య కొన్ని ప్రాచీన నృత్య కళారూపాలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని జానపద కళాకారులు సరైన ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంతర్జాతీయ నృత్య దినోత్సవం అటువంటి కళాకారులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి నృత్య పోటీలు నిర్వహించడం, ప్రతిభావంతులైన కళాకారులకు ఉపకార వేతనాలు అందించడం ద్వారా ఈ కళను తర్వాతి తరాలకు అందించవచ్చు. నేటి సాంకేతిక యుగంలో అంతర్జాల వేదికల ద్వారా కూడా నృత్య కళాకారులు తమ ప్రతిభను లోకానికి చాటుతున్నారు.

భారతీయ సంస్కృతిలో నృత్యానికి ఉన్న విశిష్టతను కాపాడుకోవడం మనందరి కనీస బాధ్యత. మన శాస్త్రీయ నృత్యాలు కేవలం వినోదం కోసమే కాకుండా, మన పురాణేతిహాసాలను, నైతిక విలువలను కూడా చాటిచెబుతాయి. ఈ ప్రత్యేకమైన రోజున ప్రతి ఒక్కరూ ఏదో ఒక నృత్యం నేర్చుకోవాలని లేక కనీసం ఒక ప్రదర్శనను వీక్షించాలని సంకల్పం తీసుకోవాలి. కళ అనేది గౌరవించబడినప్పుడే సమాజం సాంస్కృతిక రంగంలో గొప్ప అభివృద్ధిని సాధిస్తుంది. నృత్య కళాకారులను ప్రోత్సహిస్తూ, ఈ అద్భుతమైన కళా వైభవాన్ని భావి తరాలకు వారసత్వ సంపదగా అందిద్దాం. నృత్యం శరీరానికి, మనసుకి మధ్య ఒక అందమైన వారధిని నిర్మిస్తుంది. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రీతిలో చిందులు వేయడం వల్ల శరీరంలో సానుకూల శక్తి పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న విభిన్న నృత్య రీతులు ఆయా దేశాల చరిత్రను, ఆచారాలను ప్రతిబింబిస్తాయి. ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో సోదరభావం పెంపొందుతుంది. నృత్యం మనిషిని క్రమశిక్షణతో కూడిన జీవనానికి అలవాటు చేస్తుంది, ఇది వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుంది. నేటి యువత శాస్త్రీయ నృత్యాల పట్ల ఆసక్తి చూపడం ముదావహం. వివిధ మాధ్యమాల ద్వారా దేశవిదేశాల్లోని గురువుల వద్ద శిక్షణ పొందుతూ మన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. నృత్యం ఒక వృత్తిగా మాత్రమే కాకుండా, ఒక జీవన మార్గంగా మారుతోంది. కళాకారులు తమ సృజనాత్మకతతో సరికొత్త ప్రయోగాలు చేస్తూ నృత్యానికి సరికొత్త నిర్వచనాలు ఇస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నృత్య రీతులు మారుతున్నా, అందులోని ప్రాథమిక భావం మాత్రం అలాగే నిలిచి ఉండటం విశేషం. అంతర్జాతీయ నృత్య దినోత్సవం మనకు ఇచ్చే సందేశం ఒక్కటే సంతోషంగా జీవించడం. కష్టాల్లో ఉన్నప్పుడు కూడా నృత్యం మనిషికి ఊరటనిస్తుంది. ప్రతి ఒక్కరూ ఈ కళను ఆదరిస్తూ, మన చుట్టూ ఉన్న కళాకారులను ప్రోత్సహిస్తూ నృత్య ప్రపంచంలో భాగస్వాములు కావాలి. అప్పుడే ఈ దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. మన సంప్రదాయాలను గౌరవిస్తూనే, ప్రపంచ స్థాయి నృత్య రీతులను ఆస్వాదించడం ద్వారా కళా రంగాన్ని మరింత సుసంపన్నం చేద్దాం. నృత్యమే ప్రాణంగా బతుకుతున్న కళాకారులందరికీ ఈ శుభ సందర్భం ఒక గొప్ప వేడుక కావాలి.



# భారతీయ చిత్రకళా ధృవతార

## రాజా రవివర్మ జయంతి విశేషాలు

భారతీయ చిత్రకళా చరిత్రను తిరగరాసి, కళను సామాన్యుల ముంగిటకు తెచ్చిన మహోన్నత చిత్రకారుడు రాజా రవివర్మ. 1848 ఏప్రిల్ 29న కేరళలోని కిలిమనూరులో జన్మించిన ఆయన, భారతీయ చిత్రకళకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారు. రేపు ఆయన జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కళాకారులు, కళాభిమానులు ఆయనను స్మరించుకుంటున్నారు. మన పురాణ గాథలకు, ఇతిహాసాలకు రంగుల రూపం ఇచ్చి, దైవత్వాన్ని మానవ రూపంలో ఆవిష్కరించిన ఘనత రవివర్మకే దక్కుతుంది. రవివర్మ చిత్రాల్లోని అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే, పాశ్చాత్య తైలవర్ణ చిత్రకళను భారతీయ సంప్రదాయ ఇతివృత్తాలతో మేళవించడం. అంతకుముందు చిత్రకళ కేవలం రాజభవనాలకే పరిమితం అయ్యేది. కానీ, రవివర్మ ప్రవేశపెట్టిన నూతన పద్ధతులు చిత్రకళా రంగంలో ఒక నవశకాన్ని ప్రారంభించాయి. ఆయన గీసిన చిత్రాలు కేవలం రంగుల కలయికలు కావు, అవి భారతీయ సంస్కృతికి అద్దం పట్టే సజీవ సాక్ష్యాలు. ప్రతి చిత్రంలోనూ భావోద్వేగాలు, సహజత్వం ఉట్టిపడేలా చేయడం ఆయన ప్రత్యేకత.

మన దేవాలయాల్లో, పూజా గదుల్లో మనం చూసే లక్ష్మీదేవి, సరస్వతీ దేవి రూపాలు రవివర్మ కుంచె నుండి పుట్టినవే కావడం విశేషం. దేవతలను అందమైన మానవ రూపాల్లో చిత్రీకరించడం ద్వారా భక్తులకు దైవం పట్ల ఒక స్పష్టమైన రూపాన్ని ఆయన అందించారు. మహాభారత, రామాయణ ఘట్టాలను ఆయన కళ్లకు కట్టినట్లు చిత్రించి, ఆ కథలను అక్షరాస్యులకే కాక నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యేలా చేశారు. శకుంతల, దమయంతి వంటి పాత్రలు ఆయన చిత్రాల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోయాయి. చిత్రకళ కేవలం ధనికులకే సొంతం కాకూడదనే ఉద్దేశంతో ఆయన ముంబైలో ఒక ముద్రణాలయాన్ని ప్రారంభించారు. దీని ద్వారా తన చిత్రాలను తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు. రవివర్మ గీసిన చిత్రాల ముద్రణలు ప్రతి ఇంటా పూజలందుకోవడం మొదలైంది. కళను ప్రజాస్వామీకరించిన గొప్ప సంస్కర్తగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. అప్పటి వరకు తెర వెనుక ఉన్న కళను వీధి వీధినీ తాకించిన ఘనత ఆయన సృజనాత్మకతకే దక్కుతుంది.

రవివర్మ చిత్రాల్లోని రంగుల ఎంపిక, వెలుతురు నీడల ప్రభావం అద్భుతంగా ఉంటుంది. భారతీయ మహిళల సౌందర్యాన్ని, చీరకట్టులోని వైవిధ్యాన్ని ఆయన తన చిత్రాల్లో చాలా గౌరవప్రదంగా ఆవిష్కరించారు. ఆయన చిత్రించిన నలుపుతెలుపు మరియు రంగుల చిత్రాలు నేటికీ ఆధునిక చిత్రకారులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. పాశ్చాత్య దేశాల వారు కూడా భారతీయ చిత్రకళా నైపుణ్యాన్ని గుర్తించేలా చేసిన అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మేధావి ఆయన.

కేవలం చిత్రకారుడిగానే కాకుండా, భారతీయ సంస్కృతీ వారసత్వ రక్షకుడిగా రవివర్మ చేసిన సేవలు అనన్యం. విదేశీ పాలనలో ఉన్న సమయంలో భారతీయ మూలాలను రక్షించడానికి ఆయన తన కుంచెను ఆయుధంగా మలుచుకున్నారు. మన పూర్వీకుల గొప్పతనాన్ని, వేదకాలపు సంస్కృతిని చిత్రాల రూపంలో భద్రపరిచారు. ఆయన కృషితోనే భారతీయ చిత్రకళకు ఒక ప్రత్యేకమైన శైలి ఏర్పడింది. నేటి తరం కళాకారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. రాజా రవివర్మ జయంతి వేళ ఆయన చిత్రాల ప్రదర్శనలు, చర్చా వేదికలు నిర్వహించడం ద్వారా యువతకు మన గొప్ప కళా చరిత్రను వివరించవచ్చు. ప్రభుత్వాలు మరియు కళా సంస్థలు ఆయన స్మృత్యర్థం చిత్రకళా పోటీలు నిర్వహించడం అభినందనీయం. రవివర్మ వారసత్వం కేవలం కేరళకో లేదా భారత్‌కో పరిమితం కాలేదు, అది ప్రపంచ కళా ప్రపంచానికి ఒక వెలకట్టలేని కానుక. ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

రాజా రవివర్మ అంటే ఒక వ్యక్తి కాదు, అదొక అద్భుతమైన కళా విప్లవం. సామాన్యుడి పూరి గుడిసె నుండి ధనికుడి మేడ వరకు తన చిత్రాలతో వెలుగులు నింపిన మహానుభావుడు. రేపు ఆయన జయంతిని పురస్కరించుకుని భారతీయ చిత్రకళా వైభవాన్ని ఒకసారి తలుచుకుందాం. కళా ప్రపంచంలో ఆయన వేసిన ముద్ర చెరిగిపోనిది, మరచిపోలేనిది. రవివర్మ కుంచె నుండి జాలువారిన ప్రతి రంగు చుక్క భారతీయతకు ఒక నిదర్శనం.

# అనంత విశ్వం - అద్భుత దృశ్యం



విశాలమైన ఆకాశం, అందులో మిరుమిట్లు గొలిపే నక్షత్రాలు, గ్రహాల గమనం మానవుడిని ఎప్పుడూ ఆశ్చర్యానికి గురి చేస్తూనే ఉంటాయి. ఖగోళ శాస్త్రం పట్ల సామాన్య ప్రజలలో, ముఖ్యంగా విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా వసంతకాలంలో అంతర్జాతీయ ఖగోళ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ఖగోళ ప్రియులు ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. విశ్వం గురించిన రహస్యాలను తెలుసుకోవడం, నక్షత్ర మండలాలను పరిశీలించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశం. ఖగోళ దినోత్సవం అనేది కేవలం శాస్త్రవేత్తలకు మాత్రమే పరిమితమైనది కాదు, ఇది ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్కరి పండుగ. సాధారణంగా ఏప్రిల్ లేదా మే నెలల్లో వచ్చే ఈ రోజును చంద్రుడి స్థితిని బట్టి నిర్ణయిస్తారు. వసంతకాలంలో ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల నక్షత్రాలను వీక్షించడానికి ఇది సరైన సమయంగా పరిగణించబడుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖగోళ పరిశోధన కేంద్రాలు, నక్షత్రశాలలు ప్రజల కోసం ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తాయి.

నేటి యాంత్రిక జీవనంలో మనం ఆకాశం వైపు చూడటమే మరిచిపోతున్నాం. కృత్రిమ వెలుతురు వల్ల కలిగే కాలుష్యం కారణంగా నగరాల్లో నక్షత్రాలు సరిగ్గా కనిపించడం లేదు. ఇటువంటి రోజులు మనల్ని తిరిగి ప్రకృతికి దగ్గర చేస్తాయి. టెలిస్కోపుల ద్వారా గ్రహాలను, వాటి ఉపగ్రహాలను చూడటం వల్ల పిల్లల్లో వైజ్ఞానిక దృక్పథం పెరుగుతుంది. ఖగోళ శాస్త్రం కేవలం ఒక విషయం కాదు, అది మన ఉనికిని అర్థం చేసుకునే ఒక గొప్ప మార్గం. ఖగోళ పరిశోధనల్లో భారతదేశం ప్రపంచ దేశాలకు దీటుగా దూసుకుపోతోంది. మన ఇస్రో సంస్థ సాధిస్తున్న విజయాలు నేటి తరం యువతకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. చంద్రయాన్, మంగళయాన్ వంటి ప్రయోగాల వల్ల సామాన్యులకు కూడా అంతరిక్షంపై మక్కువ పెరిగింది. ఈ అంతర్జాతీయ ఖగోళ దినోత్సవం సందర్భంగా మన దేశం సాధించిన ప్రగతిని గుర్తుచేసుకోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా ఇటువంటి విశేషాలను చేరువ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆకాశ వీక్షణ అనేది ఒక అద్భుతమైన అనుభవం. నక్షత్రాల పుట్టుక, నశించడం, పాలపుంతల విస్తరణ వంటి విషయాలు మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఖగోళ శాస్త్రవేత్తలు ఈ రోజున ప్రజలతో ముఖాముఖి నిర్వహించి, విశ్వం పుట్టుకకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తారు. పాఠశాలల్లో కూడా అంతరిక్షానికి సంబంధించిన చిత్రలేఖన పోటీలు, వ్యాస రచనలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. మేధో వికాసానికి ఇది ఎంతో దోహదపడుతుంది.

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఖగోళ శాస్త్రాన్ని అధ్యయనం చేయడం చాలా సులభమైంది. అనేక రకాల మొబైల్ యాప్‌ల ద్వారా ఆకాశంలో ఏ నక్షత్రం ఎక్కడ ఉందో సులభంగా గుర్తించవచ్చు. అయితే, ప్రత్యక్షంగా టెలిస్కోపు ద్వారా ఆకాశాన్ని చూడటంలో ఉండే ఆనందం వేరు. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా స్థానిక సైన్స్ క్లబ్‌లు లేదా విద్యా సంస్థలు ఆకాశ వీక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయం. దీనివల్ల మూఢనమ్మకాలు తొలగిపోయి శాస్త్రీయ ఆలోచనలు బలపడతాయి.

ఖగోళ శాస్త్రం మానవజాతికి అనేక పాఠాలను నేర్పుతుంది. ఈ అనంత విశ్వంలో మన భూమి ఎంత చిన్నదో గ్రహించినప్పుడు, మనుషుల మధ్య ఉన్న విద్వేషాలు అర్థరహితమని అనిపిస్తుంది. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని కూడా ఇది మనకు గుర్తు చేస్తుంది. అంతరిక్షం గురించి పరిశోధనలు చేయడం వల్ల కేవలం గ్రహాల గురించే కాకుండా, మన భూమిపై ఉన్న వాతావరణ మార్పులను కూడా ముందుగానే ఊహించే అవకాశం కలుగుతుంది.

అంతర్జాతీయ ఖగోళ దినోత్సవం మనలోని అన్వేషకుడిని నిద్రలేపుతుంది. రేపు రాత్రి ఆకాశం వైపు చూస్తూ ఈ విశ్వం గొప్పతనాన్ని ఒక్క క్షణం తలుచుకుందాం. నక్షత్రాల కాంతిలో మన కలలను వెతుక్కుందాం. ఖగోళ శాస్త్రాన్ని ఆదరిస్తూ, సైన్స్ పట్ల మక్కువ పెంచుకుంటూ ప్రపంచ పురోగతిలో భాగస్వాములు అవుదాం. విశ్వం మనకు అందించే విజ్ఞానాన్ని భావి తరాలకు వారసత్వంగా అందించడమే ఈ దినోత్సవం యొక్క అసలైన లక్ష్యం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## 'మైఖేల్' బాక్సాఫీస్ దుమ్మురేపుతోంది..

దివంగత పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'మైఖేల్' బయోపిక్ ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో భారీ వసూళ్లు సాధిస్తూ సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా గ్లోబల్‌గా సుమారు 220 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.2000 కోట్లు) చేరువలో ఉండగా, భారత దేశంలో కూడా మంచి స్పందన దక్కించుకుంది. ఇండియా మార్కెట్‌లోనే సుమారు రూ.20 కోట్ల వసూళ్లు సాధించడం విశేషం. మైఖేల్ జాక్సన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అపారమైన




అభిమానాన్ని ఈ చిత్రం మరోసారి చాటుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు ఆంటోనీ ఫుక్వా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించారు. మైఖేల్ జాక్సన్ జీవితంలోని ఎదుగుదల, సంగీత ప్రయాణం, వ్యక్తిగత జీవితంలోని సంఘర్షణలను భావోద్వేగంగా తెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా ఆయన ఐకానిక్ డ్యాన్స్ స్టెప్స్, సంగీత ప్రతిభను అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో టైటిల్ పాత్రలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ నటించారు. ఆయన నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ స్టైల్ చూస్తుంటే మైఖేల్ జాక్సన్ మళ్లీ తెరపైకి వచ్చినట్టే ఉందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

## వారాహి అమ్మవారి దర్శనం తర్వాత జీవితం మారింది: శృతి

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ కూతురు, స్టార్ హీరోయిన్ శృతి హాసన్ తాజాగా తన భక్తి భావనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొదట సింగర్‌గా కెరీర్ ప్రారంభించిన శృతి, తర్వాత హీరోయిన్‌గా మారి తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. 'అనగనగ ఓ ధీరుడు'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఆమె, పవన్ కళ్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్'తో భారీ హిట్ అందుకుని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ తన



స్థాయిని మరింత పెంచుకుంది. ఇటీవల సలార్ సినిమాతో పాన్ ఇండియా హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. నీలాచల్ కొండపై ఉన్న ఈ పవిత్రక్షేత్రంలో వారాహి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత తన జీవితంలో మార్పులు వచ్చాయని శృతి తెలిపింది. "దేవుళ్లను మనం మాత్రమే ఎంచుకోవడం కాదు, వారు కూడా మనల్ని ఎంచుకుంటారు. స్నేహితుడి సూచనతో ఆలయానికి వెళ్లాను. అక్కడ ఎలాంటి ఆడంబరం లేదు, వీఐపీ క్యూ లేదు. గర్భగుడిలోకి వెళ్లగానే నిజమైన భక్తి అనుభూతి కలిగింది. వారాహి అమ్మవారు ఎంతో శక్తివంతమైన దేవత" అని ఆమె పేర్కొంది.



## 'ది ఇండియా స్టోరీ'తో సామాజిక సందేశం

సామాజిక అంశాలను ప్రధానంగా తీసుకుని రూపొందిన మరో చిత్రం 'ది ఇండియా స్టోరీ' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించారు. ఈ సినిమాను జూలై 24న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

ఈ చిత్రం రైతులు వ్యవసాయంలో ఉపయోగించే పురుగుమందుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను కేంద్రంగా తీసుకుని రూపొందింది. రసాయనాల దుష్ప్రభావాల కారణంగా దేశవ్యాప్తంగా అనేక మంది ఎదుర్కొంటున్న సమస్యలను కథలో ప్రతిబింబించారు. వాస్తవానికి దగ్గరగా ఉండే ఈ కథ ద్వారా సమాజంలో అవగాహన పెంచడమే చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. సినిమాలో కాజల్ అగర్వాల్ ఒక ధైర్యవంతమైన న్యాయవాది పాత్రలో కనిపించనుంది. కంపెనీల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బయటపెట్టే పాత్రను ఆమె పోషిస్తోంది. అలాగే మనీష్ వాధ్వా కీలక పాత్రలో నటిస్తూ కథను మరింత బలంగా తీసుకెళ్తున్నారు.

వినోదంతో పాటు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో రూపొందిన ఈ చిత్రం, వ్యవసాయ రంగంలో జరుగుతున్న లోపాలు, వాటి ప్రభావాలను స్పష్టంగా చూపించే ప్రయత్నం చేసింది. బలమైన కథ, భావోద్వేగభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకులను ఆలోచింపజేసేలా సినిమా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. మొత్తంగా చూస్తే, 'ది ఇండియా స్టోరీ' కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో చర్చకు దారితీసే అంశాలను తెరపైకి తీసుకువస్తున్న ప్రాజెక్ట్‌గా నిలవనుంది. ఇక ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా వెలుగొందిన కాజల్ అగర్వాల్, పెళ్లి తర్వాత కూడా సినిమాలు, వ్యాపారాలతో సమతుల్యం పాటిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in